క్లుప్తంగా

రజకుల 250 యూనిట్ల విద్యుత్‌ను సవరించాలి


రంగారావుకు పుష్పగుచ్ఛం ఇస్తున్న సారయ్య

సిరిసిల్ల: రాష్ట్రంలోని రజకులకు ప్రభుత్వం ఉచితంగా అందించే విద్యుత్‌లో సమస్యలను సవరించాలని ఎమ్మెల్సీ బసవరాజు సారయ్య రాష్ట్ర విద్యుత్ నియంత్రణ మండలి చైర్మన్ శ్రీరంగారావుకు బుధవారం వినతిపత్రం అందించారు. రజకులకు 250 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందిస్తుండగా అంతకు మించి వినియోగించే విద్యుత్ యూనిట్ రేట్లను కమర్షియల్‌గా ఎక్కువ బిల్లింగ్ చేస్తున్నారని వివరించారు. దీన్ని రాష్ట్ర వ్యాప్తంగా సవరించి రజకులకు న్యాయం చేయాలని కోరారు. ఎమ్మెల్సీ బసవరాజు సారయ్య, అక్కరాజు శ్రీనివాస్ ఇచ్చిన వినతిపత్రంపై ఆర్‌ఈసీ చైర్మన్ శ్రీరంగారావు సానుకూలంగా స్పందించారు. కార్యక్రమంలో ముస్తాబాద్ 'సెస్' డైరెక్టర్ ఎస్.అంజిరెడ్డి పాల్గొన్నారు.

మంచినీటి కోసం ఆందోళన


నిరసన వ్యక్తం చేస్తున్న మహిళలు

గంభీరావుపేట: గంభీరావుపేట మేజర్ గ్రామ పంచాయతీ పరిధిలోని 11వార్డులో మంచినీళ్ల కోసం మహిళలు బుధవారం ఖాళీ బిందెలతో నిరసన వ్యక్తం చేశారు. వార్డులోని బోరు చెడిపోయి రెండేళ్లవుతున్నా గ్రామపంచాయతీ అధికారులు పట్టించుకోవడం లేదని మహిళలు ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ కాలనీకి మిషన్ భగీరథ నీళ్లు కూడా రావడం లేదని తెలిపారు. జిల్లా ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి తమ వార్డులో మంచినీటి సమస్య పరిష్కరించాలని మహిళలు కోరారు.

డీజే నిర్వాహకులు బైండోవర్


డీజే నిర్వాహకులతో మాట్లాడుతున్న సీఐ

వేములవాడరూరల్: గ్రామాల్లో డీజేలు పెట్టి ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తే చర్యలు తీసుకుంటామని వేములవాడ రూరల్ సీఐ కృష్ణకుమార్ అన్నారు. ఆరుగురు డీజే ఓనర్లను ఆయన బుధవారం తహసీల్దార్ ముందు బైండోవర్ చేశారు. ఈ సందర్భంగా ఆయన వారితో మాట్లాడుతూ వినాయక చవితి పండుగ సందర్భంగా డీజేలు పెట్టి ర్యాలీలు నిర్వహిస్తే డీజే ఓనర్లతో పాటు వాహనదారులు, వినాయక మంటప నిర్వాహకులపై కేసులు నమోదు చేస్తామని ఆయన అన్నారు. పోలీసులకు సహకరించి ప్రశాంత వాతావరణంలో పండుగను నిర్వహించుకోవాలరు. ఆయనతో పాటు ఎస్‌ఐ మారుతి ఉన్నారు.

ముస్తాబాద్: మండల పరిధిలోని 15 మంది డీజే నిర్వాహకులను తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేసినట్లు ఎస్సై రమాకాంత్ తెలిపారు.

బోయినపల్లి: మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 11 మంది డీజే యజమానులను తహసీల్దార్ పుష్పలత ముందు బైండోవర్ చేసినట్లు ఎస్సై మామిడి మహేందర్ బుధవారం తెలిపారు.

ఎన్నాళ్లీ నిరీక్షణ..?

సిరిసిల్లఅర్బన్: పేదోడి సొంతింటి కల, కలగానే మిగులుతోంది. ఇళ్లు లేని నిరుపేదలకు ప్రభుత్వం ఇళ్లు నిర్మిస్తామన్న హామీ ఇచ్చి ఏళ్లు గడిచిన నేరవేరడం లేదు. సొంతింటి కళ నెరవేరుతుందని ఆశపడుతున్న నిరుపేదలకు ఎదురుచూపు తప్పడం లేదు. ఇదిగో ఇస్తాం.. అదిగో ఇస్తాం అని కాలయాపన చేయడంతో లబ్ధిదారులు ఆశల ఆడియాశలుగా మారుతున్నాయి. సిరిసిల్ల మున్సిపల్ పరిధి పెద్దూరు, రగుడు శివారుతో పాటు శాంతినగర్‌లో నిరుపేదల కొరకు డబుల్ బెడ్రూం ఇళ్ల నిర్మాణం చేపట్టింది. కానీ లబ్ధిదారులకు కేటాయింపులో ఆలస్యం కావడంతో నిరుపేదలు కిరాయి ఇళ్లలోనే ఉంటున్నారు.

- డబుల్ కోసం ఎదురుచూపు
- ఎంపిక పూర్తయినా కేటాయింపులో జాప్యం
- మందుబాబులకు అడ్డాగా మారుతున్న వైనం


సిరిసిల్ల పెద్దూరు శివారులో నిర్మాణంలో ఉన్న డబుల్ బెడ్రూం ఇళ్ల సముదాయం

లబ్ధిదారుల ఎదురుచూపు

సిరిసిల్ల పట్టణంలోని ఇళ్లు లేని నిరుపేదల కొరకు ప్రభుత్వం దాదాపు ఆరేళ్ల క్రితం డబుల్ బెడ్రూం ఇళ్ల నిర్మాణానికి చర్యలు చేపట్టింది. ఇందులో మండెపల్లిలో 1,260, శాంతినగర్‌లో 204, పెద్దూరు 516, రగుడు శివారులో 72 ఇళ్లను ప్రభుత్వం నిర్మించింది. మండెపల్లిలో డబుల్ బెడ్రూం ఇళ్లను ఇప్పటికే ఇళ్లులేని నిరుపేదలకు అందజేశారు. పెద్దూరు, రగుడు, శాంతినగర్ డబుల్ బెడ్రూం సముదాయాలలో డ్రెయినేజీ, రోడ్లు, మంచినీటి, విద్యుత్ తదితర పనులు పెండింగ్‌లో ఉండగా ఇటీవల పూర్తిచేశారు. అక్కడక్కడ కొన్ని పనులు పెండింగ్‌లో ఉన్నాయి. ఇప్పటికే పట్టణంలోని పలు వార్డుల్లో డబుల్ బెడ్రూం లబ్ధిదారులను డ్రా ద్వారా ఎంపిక చేశారు. కానీ లబ్ధిదారులకు ఇళ్లను కేటాయించడంలో జాప్యం చోటు చేసుకోవడంతో ఇళ్లు లేని నిరుపేదలు ఇబ్బందులు పడుతున్నారు. కూలీ నాలీ చేసుకుంటూ వచ్చిన పైసలు ఇంటి అద్దె చెల్లిస్తూ ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారు.

అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా

పెద్దూరు, రగుడు, శాంతినగర్‌లోని డబుల్ బెడ్రూం ఇళ్లు మందుబాబులకు, అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారుతోంది. మద్యం సేవించి మందు బాటిళ్లు అక్కడే పడేస్తూ కిటికీ అద్దాలు ధ్వంసం చేస్తున్నారు. ఇళ్ల సముదాయాల చుట్టూ పిచ్చిమొక్కలు దర్శనమిస్తున్నాయి. డబుల్ ఇళ్లను తొందరగా ఇచ్చేందుకు చర్యలు తీసుకోవాలని లబ్ధిదారులు కోరుతున్నారు.

కిరాయి ఇంట్లో ఉంటున్నం



నేను, నా భర్త ఇద్దరు పిల్లలతో కొన్నేళ్ల నుంచి కిరాయి ఇంట్లో ఉంటున్నా. ఇటీవల డబుల్ బెడ్రూం ఇళ్ల డ్రాలో నాపేరు వచ్చింది. కానీ ఇప్పటికీ ఇళ్లను ఇవ్వలేదు. త్వరగా ఇళ్లు కేటాయించాలి.

– విశ్వనాథుల మల్లేశ్వరి, రగుడు

వెంటనే కేటాయించాలి



డబుల్ ఇళ్ల డ్రాలో పేరు వచ్చినప్పటికీ ఇళ్లను కేటాయించకపోవడంతో నేటికి కిరాయి ఇంట్లో ఉంటున్నం. అంతేగాక డబుల్ ఇళ్లు ఆకతాయిలకు అడ్డాగా మారుతున్నాయి. అర్హులైన నిరుపేదలకు ఇళ్లు కేటాంచాలి.

– గంభీరావుపేట ప్రశాంత్, సర్దాపూర్

త్వరలోనే అందజేస్తాం



పట్టణంలో డబుల్ బెడ్రూం ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక పూర్తయ్యింది. ఇళ్ల సముదాయాల్లో పనులు కూడా పూర్తి దశకు చేరుకున్నాయి. పంపిణీ తేదీని ప్రకటించి త్వరలోనే లబ్ధిదారులకు ఇళ్లను అందజేస్తాం.

– ఎండీ ఆయాజ్, మున్సిపల్ కమిషనర్, సిరిసిల్ల

సమాచారం

ఆదర్శ కళాశాలలో ఇంటర్ స్పాట్ అడ్మిషన్లు

బోయినపల్లి: స్థానిక ఆదర్శ పాఠశాల, జూనియర్ కళాశాలలో 2023–24 ఇంటర్ మొదటి సంవత్సరానికి మిగిలిన సీట్లకు ఈ నెల 16వ తేదీలోగా స్పాట్ అడ్మిషన్లు నిర్వహించనున్నట్లు ఎంఈవో శ్రీనివాసదీక్షిత్, ప్రిన్సిపాల్ నిమ్మల సుధాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీసీ, బైపీసీ, సీఈసీ గ్రూప్‌లలో మిగిలిన సీట్ల భర్తీకి ఈ నెల 16 లోపు విద్యార్థులు నేరుగా కళాశాలకు వచ్చి, లేదా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. విద్యార్థులు తమ వెంట ఆధార్ కార్డు, ఎస్సెస్సీ మెమో, ఫొటో తీసుకురావాలని కోరారు.

నియామకం

వ్యవసాయ విస్తరణాధికారుల సంఘం జిల్లా కార్యవర్గం

సిరిసిల్లఅర్బన్: సిరిసిల్ల మున్సిపల్ పరిధి చంద్రంపేటలోని జిల్లా రైతు వేదికలో జిల్లా వ్యవసాయ విస్తరణ అధికారుల నూతన కార్యవర్గాన్ని బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడుగా డి. లక్ష్మణ్, ప్రధాన కారదర్శి బి. హేమాజీ, కోశాధికారి ఎం. నరేశ్, అలాగే కార్యవర్గసభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారులుగా కే. శ్రీనివాస్, జి. ప్రవీణ్ వ్యవహరించగా కార్యక్రమంలో పలు గ్రామాల క్లస్టర్ ఏఈవోలు పాల్గొన్నారు.

ఆయుష్మాన్‌భవపై అవగాహన


మాట్లాడుతున్న ఎంపీపీ పడిగెల మానస

తంగళ్లపల్లి: కేంద్ర ప్రభుత్వం ప్రభుత్వ ఆసుపత్రుల ద్వారా అందిస్తున్న ఆయుష్మాన్‌భవ సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ పడిగెల మానస అన్నారు. మండల కేంద్రంలోని తంగళ్లపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బుధవారం ఆయుష్మాన్‌భవ కార్యక్రమం ప్రారంభించారు. మెడికల్ అధికారి డాక్టర్ స్నేహ, బీఆర్‌ఎస్ టౌన్ అధ్యక్షుడు బండి జగన్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

వీర్నపల్లిలో..

వీర్నపల్లి: స్థానిక పల్లె దవాఖాన ఆవరణలో ఎంఎల్‌హెచ్‌పి మమత ఆధ్వర్యంలో ఆయుష్మాన్ మేళాపై అవగాహనా కార్యక్రమన్ని నిర్వహించారు.

రోడ్డు నిర్మించాలని ధర్నా


ధర్నా చేస్తున్న ఏబీవీపీ నాయకులు

ఇల్లంతకుంట: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలకు వెళ్లే రోడ్డు నిర్మించాలని ఏబీవీపీ నాయకులు మండల కేంద్రంలో బుధవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రోడ్డు పూర్తిగా గుంతలమయంగా మారడంతో పాటు, కల్వర్టు పాడైపోవడంతో మోకాళ్ల లోతు నీరు నిల్వ ఉండి విద్యార్థులు, వాహనదారులు వెళ్లకుండా మారిందని అన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులకు సమస్య చెప్పినా పట్టించుకోవడం లేదని, బిక్కవాగుపై ఏడేళ్లుగా బ్రిడ్జి నిర్మాణం ఇంకా పూర్తి కాలేదన్నారు. కార్యక్రమంలో ఏబీవీపీ జిల్లా అధ్యక్షుడు అక్కెం నాగరాజు, ప్రవీణ్, అవినాష్, కిరణ్, సాయి, సమీర్, దినేశ్, విజయ్, రామ్‌చరణ్, ప్రవీణ్, నాగరాజు, వినయ్, నవీన్, అరవింద్, రాకేశ్, తదితరులు పాల్గొన్నారు.

పేదింటి ఆడబిడ్డలకు కల్యాణలక్ష్మి వరం

- మానకొండూర్ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్

ఇల్లంతకుంట: పేదింటి ఆడబిడ్డలకు కల్యాణలక్ష్మి పథకం వరంలాంటిదని మానకొండూర్ ఎమ్మెల్యే, తెలంగాణ సాంస్కృతిక సారథి చైర్మన్ రసమయి బాలకిషన్ అన్నారు. మండల కేంద్రంలోని రైతువేదికలో వివిధ గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. అనంతరం మండలంలోని సర్పంచులు, ఎంపీటీసీలతో అభివృద్ధి పనులపై సమీక్ష నిర్వహించారు. మండలంలోని గ్రామాల్లో చేయాల్సిన అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. అర్హులైన వారందరికి గృహలక్ష్మి పథకం ద్వారా రూ.3 లక్షల సాయం అందిస్తున్నామన్నారు. ఈనెల 15న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో మెడికల్ కళాశాల ప్రారంభోత్సవానికి మంత్రి కేటీఆర్ వస్తున్నందున ప్రజాప్రతినిధులు, నాయకులు హాజరుకావాలన్నారు. మండల కేంద్రంలో మున్నూరుకాపు మండల సంఘం, పద్మశాలీ సంఘ భవనాలకు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ వైస్‌చైర్మన్ సిద్దం వేణు, ఎంపీపీ వెంకటరమణారెడ్డి, సర్పంచుల ఫోరం అధ్యక్షుడు చల్ల నారాయణ, సర్పంచ్ భాగ్యలక్ష్మి, ఎంపీటీసీ ఒగ్గు నర్సయ్య, ఏఎంసీ చైర్మన్ సంజీవ్, పీఏసీఎస్ చైర్మన్ తిరుపతిరెడ్డి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు పల్లె నర్సింహారెడ్డి, నాయకులు పాల్గొన్నారు.


కల్యాణలక్ష్మి చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే

పెద్దమ్మ తల్లి సల్లంగా చూడు

ముస్తాబాద్: పెద్దమ్మ తల్లి ఊరు వాడ, పిల్ల పాపలను సల్లంగా చూడు తల్లి అంటూ ముస్తాబాద్‌లో ముదిరాజ్ సామాజికవర్గం బుధవారం శ్రావణ మాస ప్రత్యేక పూజలు నిర్వహించారు. పెద్దమ్మ, పోచమ్మ ఆలయాల్లో అమ్మవార్లకు అభిషేకాలు నిర్వహించారు. అనంతరం పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. మంగళహారతులు ఇచ్చి తీర్థప్రసాదాలు తీసుకున్నారు. భక్తులకు అన్నదానం చేశారు. ఎంపీటీసీ కంచం మంజుల, ముదిరాజ్ సంఘం మండల అధ్యక్షులు పిట్ల రాంగోపాల్, పట్టణ అధ్యక్షుడు నీరటి సత్యం, విఠల్, గజ్జెల రాజు, రాములు, సతీశ్, నర్సింలు, చంద్రం పాల్గొన్నారు.

నృసింహుని ఆలయంలో ప్రత్యేక పూజలు

రుద్రంగి: మండల కేంద్రంలోని ప్రహ్లాద పర్వతంపై వెలసిన శ్రీలక్ష్మీనృసింహునికి భక్తులు బుధవారం శ్రావణమాసం సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. వందలాదిగా భక్తులు కుటుంబ సమేతంగా తరలివచ్చి స్వామివారిని దర్శించుకునేందుకు బారులు తీరారు. భక్తుల సౌకర్యార్థం అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఆలయ చైర్మన్ కొమిరె శంకర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున భక్తులు, ఆలయ కమిటీ సిబ్బంది పాల్గొన్నారు.


ఆలయంలో మంగళహారతులతో మహిళలు

సీఎంకు కృతజ్ఞత సభకు సిద్ధం

- టీఎస్‌పీటీడీసీ చైర్మన్ గూడూరి ప్రవీణ్
- అంబేద్కర్ చౌరస్తాలో సభాస్థలి పరిశీలన

సిరిసిల్లటౌన్: జిల్లా ప్రజల చిరకాల వాంఛ మెడికల్ కాలేజీ కల సాకారం చేస్తున్న సీఎం కేసీఆర్, సిరిసిల్లను అభివృద్ధిలో ముందుంచుతున్న మంత్రి కేటీఆర్‌కు బీఆర్‌ఎస్ శ్రేణులు కృతజ్ఞతలు తెలిపారు. బుధవారం సిరిసిల్ల ఎమ్మెల్యే క్యాంపు ఆఫీసులో నిర్వహించిన ప్రెస్‌మీట్లో టీఎస్‌పీటీడీసీ చైర్మన్ గూడూరి ప్రవీణ్ మాట్లాడుతూ తొమ్మిదేళ్ల బీఆర్‌ఎస్ పాలనలో సీఎం కేసీఆర్ సహకారంతో మంత్రి కేటీఆర్ జిల్లాలో ఇంజనీరింగ్ కళాశాల, నర్సింగ్ కళాశాల, ప్రభుత్వ ఐటీఐ కళాశాల, ఇంటర్నేషనల్ డ్రైవింగ్ స్కూల్, అగ్రికల్చరల్ పాలిటెక్నిక్, విశ్వవిద్యాలయ అనుబంధ కళాశాలలు, మన ఊరు..మన బడి కార్యక్రమం ద్వారా ప్రభుత్వ పాఠశాలలకు పునర్‌వైభవాన్ని తీసుకొచ్చారన్నారు. జిల్లాను ఒక విజ్ఞాన కేంద్రంగా తీర్చిదిద్దిన సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్‌కు కృతజ్ఞతలు తెలుపాల్సిన బాధ్యత ప్రజలపై ఉందన్నారు. ప్రజల కలలను సాకారం చేస్తూ ఈనెల 15న సీఎం కేసీఆర్ వర్చువల్ పద్ధతిలో మెడికల్ కళాశాల ప్రారంభిస్తున్న నేపథ్యంలో స్థానిక అంబేద్కర్ చౌరస్తాలో నిర్వహిస్తున్న కృతజ్ఞత సభను విజయవంతం చేయాలని ప్రజలు, కార్యకర్తలు, పార్టీ నేతలను కోరారు. ఈమేరకు సభాస్థలిని స్థానిక అంబేద్కర్ చౌరస్తాలో డీఎస్పీ ఉదయ్‌కుమార్ రెడ్డితో పాటుగా పరిశీలించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, పట్టణ అధ్యక్షుడు జిందం చక్రపాణి, మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ, గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఆకునూరి శంకరయ్య పాల్గొన్నారు.


సభాస్థలిని పరిశీలిస్తున్న డీఎస్పీ ఉదయ్‌రెడ్డి, ప్రవీణ్, చక్రపాణి

సంక్షిప్త వార్తలు

దివ్యాంగ ఓటర్ల జాబితా పరిశీలన

తంగళ్లపల్లి: స్థానిక ఎంపీడీవో కార్యాలయ సమావేశం మందిరంలో మండలంలోని దివ్యాంగ ఓటర్ల జాబితాను గ్రామాల వారీగా తహసీల్దార్ వెంకటలక్ష్మీ ఆధ్వర్యంలో బుధవారం పరిశీలించారు. రానున్న ఎన్నికల్లో దివ్యాంగులు ఓటుహక్కు వినియోగించుకోవడానికి ప్రత్యేక ఏర్పాట్లు చేసేందుకు ఈ ప్రక్రియ చేపట్టినట్లు ఆమె తెలిపారు. ఆర్‌ఐ మధు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్ కృష్ణయ్య జన్మదిన వేడుకలు

ముస్తాబాద్: బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్ కృష్ణయ్య జన్మదిన వేడుకలను ముస్తాబాద్‌లో బీసీటీఏ, మద్దికుంటలో బీసీ యువజన సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీసీటీఏ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎల్లమ్మల లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు.

దేశాయిపల్లి రెవెన్యూ అధికారుల విచారణ

బోయినపల్లి: మండలంలోని దేశాయిపల్లి గ్రామంలో కొత్తగా పీడీఎఫ్‌ల కోసం దరఖాస్తు చేసుకున్న వారి విషయంలో వేములవాడ అర్బన్ డిప్యూటీ తహసీల్దార్ రజిత బుధవారం క్షేత్రస్థాయిలో విచారణ నిర్వహించి వివరాలు నమోదు చేసుకున్నారు. అదనపు టీఎంసీ వరద కాలువ నిర్మాణంలో గ్రామంలో 140 మందిని పీడీఎఫ్‌లుగా పేర్కొంటూ ఇటీవల జాబితా రూపొందించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో పలువురు తమకు ఆర్‌అండ్‌ఆర్‌కు అర్హులమని తమకు పరిహారం కావాలని దరఖాస్తు చేసుకోవడంతో విచారణ నిర్వహించారు.

విద్యార్థి గర్జన కరపత్రం అవిష్కరణ

సిరిసిల్లఅర్బన్: జిల్లా కేంద్రంలో వచ్చే నెల 6న ఏఐఎస్‌ఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించే విద్యార్థి గర్జన సభకు సంబంధించి కరపత్రాన్ని స్థానిక అంబేద్కర్ విగ్రహం వద్ద ఏఐఎస్‌ఎఫ్ జిల్లా కార్యదర్శి అంగూరి రంజిత్ బుధవారం ఆవిష్కరించారు.

బీఆర్‌ఎస్‌లో చేరిన బీఎస్పీ నాయకులు

ముస్తాబాద్: బీఆర్‌ఎస్ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు, అభివృద్ధిని చూసి గూడూరు గ్రామానికి చెందిన బీఎస్పీ నాయకులు బీఆర్‌ఎస్‌లో చేరారని మాజీ సర్పంచ్ చీటి వెంకటనర్సింగరావు అన్నారు. ముస్తాబాద్ మండలం గూడూరులో బీఎస్పీని వీడిన 40 మంది బీఆర్‌ఎస్‌లో బుధవారం చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం కేసీఆర్ గూడూరుపై ప్రత్యేకమైన అభిమానంతో రూ.కోటి మంజూరుతో పాటు సంక్షేమ పథకాల అమలుపై ఆకర్షితులై పార్టీలో చేరారన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు సురేందర్‌రావు, జెడ్పీటీసీ నర్సయ్య, సెస్ డైరెక్టర్ అంజిరెడ్డి, ఎదునూరి శ్రీనివాస్, ప్రభాకర్, నాంపెల్లి, దిలీప్, సంతోష్, మనీష్, కల్యాణ్, పవన్, గోపి, తిరుపతి, చాకలి బాబు, ఆంజనేయులు, మహేశ్, వెంకటేశ్ పాల్గొన్నారు.

ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్ల శ్రమదానం

ముస్తాబాద్: ఎల్లారెడ్డిపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జాతీయ సేవా పథకం విద్యార్థులు బుధవారం శ్రమదానం చేశారు. కళాశాల మైదానం, ఆవరణలో పెరిగిన పిచ్చిమొక్కలను తొలగించారు. స్వచ్ఛ భారత్ చేపట్టి చెత్తను తొలగించారు. విద్యార్థి దశలోనే విద్యార్థులు శ్రమదానం అలవరుచుకోవడం ద్వారా సామాజిక సేవకులుగా, ఉత్తమ పౌరులుగా ఎదుగుతారని ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ క్యాతం సత్యనారాయణ అన్నారు. రానున్న రోజుల్లో శీతాకాలం శిబిరాన్ని ఏర్పాటు చేసి విద్యార్థులను పంపిస్తామన్నారు. ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం అధికారి వాసరవేణి పరుశురాములు, అధ్యాపకులు, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఉపకార వేతనాల పంపిణీ

కోనరావుపేట: మండలం నాగారంలో పాల ఉత్పత్తిదారుల సంఘం ఆధ్వర్యంలో ఉత్పత్తిదారుల పిల్లలకు ఉపకారవేతనాలను అగ్రహారం డెయిరీ మేనేజర్ రవీందర్ అందజేశారు. నాగారంలోని డెయిరీలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో నలుగురు విద్యార్థులకు చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో నాగారం డెయిరీ అధ్యక్షుడు గోపాడి మధు, సూపర్‌వైజర్ శ్రీనివాస్‌రెడ్డి, డైరెక్టర్లు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం

సిరిసిల్లఅర్బన్: చేనేత జౌళి శాఖ ఆధ్వర్యంలో పట్టణంలోని 14వ వార్డులో శ్వాస చెస్ట్ ఆసుపత్రి సహకారంతో ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేయగా మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్మికులకు డాక్టర్ రాహుల్ ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించి, మందులు పంపిణీ చేశారు. కౌన్సిలర్లు అడ్డగట్ల మాధవి, జాగీరు శైలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

బహిరంగ సభను విజయవంతం చేయండి

వేములవాడరూరల్/గంభీరావుపేట/వీర్నపల్లి/ముస్తాబాద్/చందుర్తి/వేములవాడఅర్బన్: మండలంలోని హన్మాజిపేటలో బీఆర్‌ఎస్ నాయకులు బుధవారం జన సమీకరణ సన్నాహక సమావేశాలు నిర్వహించారు. ఈ నెల 15న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో మెడికల్ కాలేజీ ప్రారంభోత్సవం సందర్భంగా నిర్వహించనున్న సీఎం కేసీఆర్ కృతజ్ఞత సభకు గ్రామాల నుంచి జనాలను తరలించేందుకు జనాన్ని తరలించేందుకు ఏర్పాట్లపై చర్చించారు. కార్యక్రమాల్లో పార్టీ మండల అధ్యక్షులు గొస్కుల రవి, మ్యాకల ఎల్లయ్య, రాజిరెడ్డి, ఎల్లారెడ్డిపేట జెడ్పీటీసీ చీటి లక్ష్మణ్‌రావు, ఎంపీపీ పిల్లి రేణుక, ఏఎంసీ చైర్మన్ ఎలుసాని మోహన్‌కుమార్, సింగిల్ విండో చైర్మన్ కృష్ణారెడ్డి , కేడీసీసీ డైరెక్టర్ జలగం ముకుందరావు, సర్పంచ్ ఫోరమ్ కన్వీనర్ కమలాకర్, చందుర్తి సింగిల్‌విండో అధ్యక్షుడు తిప్పని శ్రీనివాస్, వేములవాడ పట్టణ అధ్యక్షుడు పుల్కం రాజు, జెడ్పీటీసీ రవి పాల్గొన్నారు.

ఉత్సవాలను ప్రశాంతంగా నిర్వహించుకోవాలి

- చందుర్తి సీఐ అచ్చ కిరణ్‌కుమార్

చందుర్తి: వినాయక చవితి నవరాత్రోత్సావాలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని చందుర్తి సీఐ అచ్చ కిరణ్‌కుమార్ కోరారు. చందుర్తి పోలీసుస్టేషన్ ఆవరణలో మండలంలోని అన్ని గ్రామాల వినాయక మండపాల నిర్వాహకులతో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. మండపాల నిర్వాహకులు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలన్నారు. నియమ నిబంధనాలను పాటించకపోతే చర్యలు తీసుకుంటామన్నారు. మండపాలను ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా ఏర్పాటు చేసుకోవాలన్నారు. కేటాయించిన సమయంలో బాక్స్‌లను పెట్టుకోవాలన్నారు. అధిక శబ్దంతో ప్రజలను ఇబ్బందులకు గురిచేయవద్దని కోరారు. నిర్వాహకులు తప్పనిసరిగా మండపాల వద్ద ఉండి శాంతియుత వాతావరణంలో నవరాత్రి ఉత్సవాలను జరుపుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో చందుర్తి ఎస్సై సిరిసిల్ల అశోక్, సిబ్బంది , అన్ని గ్రామాల నిర్వాహకులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సీఐ కిరణ్‌కుమార్


తడగొండలో..

బోయినపల్లి: మండలంలో గణేశ్ నవరాత్రి ఉత్సవాలు ప్రశాంతంగా నిర్వహించుకోవాలని ఎస్సై మామిడి మహేందర్ అన్నారు. మండలంలోని తడగొండ గ్రామంలో ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సర్పంచు చిందం రమేశ్, హెడ్‌కానిస్టేబుల్ రామస్వామి పాల్గొన్నారు.

బోయినపల్లి: మండలంలోని నీలోజిపల్లి గ్రామంలో ఎస్సై మామిడి మహేందర్ బుధవారం శాంతి సమావేశం నిర్వహించారు.

ఆఫ్‌లైన్‌లో బదిలీలు చేపట్టాలి

సిరిసిల్లటౌన్: ప్రస్తుతం జరుగుతున్న ఉపాధ్యాయుల పదోన్నతులు, బదిలీలు ఆఫ్‌లైన్ పద్ధతిలోనే నిర్వహించాలని టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు దోర్నాల భూపాల్‌రెడ్డి, దుమాల రమానాథ్‌రెడ్డి డీఈవో రమేశ్‌కు వినతిపత్రాన్ని ఇచ్చి మాట్లాడారు. ఆన్‌లైన్ ద్వారా చేపట్టడం మూలంగా ఎన్నో సమస్యలు తలెత్తుతున్నాయన్నారు. ముఖ్యంగా స్పౌస్ ఉపాధ్యాయులకు ఆప్షన్‌ల ఎంపికలో గందరగోళం తలెత్తుతుందని, ఎస్జీటీ ఉపాధ్యాయులు, హెచ్ఎంల విషయంలో వందలాది ఆప్షన్లు పెట్టుకోవాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు.


డీఈవోకు వినతిపత్రం ఇస్తున్న భూపాల్‌రెడ్డి, రమానాథ్‌రెడ్డి

18 నుంచి 26 వరకు గణేశ్ నవరాత్రి ఉత్సవాలు

వేములవాడ: ఈనెల 18 నుంచి 26 వరకు నాగిరెడ్డి మంటపములో గణేశ్ నవరాత్రోత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈవో కృష్ణప్రసాద్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 18న ఉదయం 9.15 గంటలకు పుణ్యాహవాచనము, అఖండ దీపారాధన, సిద్ధి, బుద్ధి వినాయక ప్రతిష్ఠ కార్యక్రమంతో ఉత్సవాలు ప్రారంభమవుతాయన్నారు. ప్రతిరోజు ఉదయం, సాయంత్రం అభిషేకములు, అర్చనలు, గణేశపురాణ ప్రవచనం, వినాయక చవితి రోజు సాయంత్రం 4 గంటలకు శమంతకోపాఖ్యానము నిర్వహిస్తామన్నారు. ఈనెల 25న ఉదయం 9 గంటలకు మహాగణపతి మూలమంత్ర హవనం, అదేరోజు రాత్రి 7.15 గంటలకు శ్రీలక్ష్మీగణపతి స్వామివారికి మహాపూజ నిర్వహిస్తామన్నారు. ఈనెల 26న ఉదయం 11.15 గంటలకు పూర్ణాహుతి, రాత్రి 7.10 గంటల నుంచి పెద్దసేవ ఊరేగింపు అనంతరము గణేశ నిమజ్జనం నిర్వహిస్తామన్నారు. వినాయక చవితి రోజు నిత్య కల్యాణం రద్దు చేస్తున్నట్లు తెలిపారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై ఉత్సవాలను విజయవంతం చేయాలని కోరారు.

ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌కు రూ.2 కోట్లు మంజూరు

వేములవాడరూరల్: నిధుల కొరతతో నిలిచిపోయిన ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌కు రూ.2 కోట్లు మంజూరు అయినట్లు మున్సిపల్ కమిషనర్ అన్వేశ్ తెలిపారు. కలెక్టర్ నుంచి అనుమతి ఉత్తర్వులు రాగానే పనులు ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. 18 నెలలుగా కొనసాగుతున్న పనులు నిధులు మంజూరుతో పూర్తవుతాయని తెలిపారు.

